


అవతల సన్నగా తుంపర పడుతుంటే మధుమూర్తి మనసు ఆనందంతో నిండిపోయింది.

"వర్షాలు ప్రారంభమయ్యాయి. . . శ్రావణ మాసం వచ్చేసిందన్నమాట!"— తన రూములో కిటికీ దగ్గర మంచి అనుకున్నాడు.

శ్రావణమాసం వచ్చేసింది అనుకోగానే అతనికి వెంటనే శ్యామల గుర్తుకు వచ్చింది. శ్యామల!. . . అందాల శ్యామల. . .తన మనోహరి. . .తన ప్రాణం నిరంతరం తన హృదయ పీటంపై నిలిచి ఉండే అనురాగ దేవత...ఎక్కడుందో ఇప్పుడు. .ఎన్నాళ్లైంది పోయిందో శ్యామల్ని చూసి. . . చిన్నతనంలోనే చెరగని ముద్రవేసిన ఆమె ఈ సంవత్సరమైనా కనపడుతుందా?. . . ఈ పూళ్ళోనైనా కనపడుతుందా?

మధుమూర్తి ఆలోచిస్తూ అవతలకు చూస్తున్నాడు.

వర్షం పెద్దదై ధారగా కురుస్తూంది.

మధుమూర్తిలో ఆలోచన్లు కూడా వేగం పుంజుకున్నాయి.

అప్పట్లో మధుమూర్తి నాన్నగారు కాకినాడలో పనిచేస్తూండేవారు. రామారావుపేటలో మధుమూర్తి వాళ్ళింటి ప్రక్కవాటాలో ఉండేవారు శ్యామలా వాళ్ళూ. శ్యామల తండ్రికేదో వ్యాపారం ఉండేది. ప్రక్క ప్రక్కల్నే ఉండడంవలన మధుమూర్తి వాళ్ళ కుటుంబానికీ—శ్యామలవాళ్ళ కుటుంబానికీ సఖ్యత ఎక్కువ ఉండేది.

మధుమూర్తికి అప్పుడు పదేళ్ళుండేవి. శ్యామల ఏడేళ్ళ పిల్ల. వయసులో చిన్నవాళ్ళే కావటం మూలాన ఇద్దరూ కలిసి ఆడుకోవటం—కలసి తిరగటం ఎక్కువగా ఉండేది.

ఆ ఆటల్లోనే తగవులూ—పోట్లాటలూ. అయినా అదెంతసేపు ఉండేది కాదు. మరుక్షణంలోనే ఒకటై పోతూండేవారు. అందుకు కారణం మధుమూర్తికి శ్యామలంటే వల్లమాలిన అపేక్ష ఉండడం వల్లనే.

ఒక స్కూలుకు వెళ్ళినప్పుడూ—పడుకున్నప్పుడూ తప్ప మిగిలిన సమయాల్లో ఒకర్నివిడిచి ఒకరు ఉండేవారు కారు.

వాళ్ళ ఆటాపాటా అంతా మధుమూర్తి ఇంట్లోనే జరిగేది. ఆ కారణం చేత శ్యామల తరచు అక్కడే ఉంటూ ఉండేది.

అది చూసి శ్యామల తల్లి మధుమూర్తి తల్లితో "ఏమండీ వదినగారూ! మా అమ్మాయి అస్తమానం మీ ఇంట్లోనే కట్టేసిఉంచుతున్నాడు మీ అబ్బాయి. కోడల్ని కాని చేసేసుకుంటారా?" అనేది నవ్వుతూ.

అందుకు మధుమూర్తి తల్లి—"అంతకంటేనా వదినా. . .శ్యామలలాంటి మహాలక్ష్మి కోడలైవస్తే కాదనుకోగల్నా?" అని—

"అయినా మీలాంటి భాగ్యవంతుల పిల్లల్ని మాలాంటి సామాన్యుల ఇళ్ళలో ఇస్తారా?" అనేది.

ఆ మాటలు వింటూ—"భలే వారే వదినా మీరు. . .లక్షలు రావచ్చు—పోవచ్చు లక్షణమైన అబ్బాయి అన్నిసార్లు దొరుకుతాడా?. . .అయినా మేమెంత భాగ్యవంతులమనీ. . .ఏదో చిన్న వ్యాపారం! అంతేగా?" అనేది శ్యామల తల్లి.

అనటమే కాదు మధుమూర్తి కనిపించినప్పుడల్లా "ఏమోయ్ అల్లుడగా. . . అస్తమానూ పెళ్ళాన్ని అలా వెంటేసుకుని తిరగటమేనా నాలుగు ముక్కలు చదివించటం ఉందా?" అనేది నవ్వుతూ.

ఆ మాటలు వింటూ మధుమూర్తి బోలెడంత సిగ్గుపడి పోయేవాడు. కానీ మనసులో మాత్రం శ్యామల తన స్వంతం అన్న భావం పాతుకు పోసాగింది.

శ్యామలంటే అటుపైన మధుమూర్తిలో మరింత అపేక్ష—అభిమానం పెరిగాయి.

గుండ్రని కళ్ళూ. . .చక్కటి ముక్కూ. . . చిన్ననోరు. . .పట్టు పరికిణీ. . .పట్టు జాకెట్టు వేసుకుని జడ గంటలు పెట్టుకుని కుందనపు బొమ్మలా ఉండేది శ్యామల.

ఆ రూపం మధుమూర్తి చిన్న మనసులో పీటం వేసుకుని ఉండిపోయింది. ఒకరోజు ఆటల సమయంలో ఉండబట్టలేక మధుమూర్తి—

"శ్యామలా! మనిద్దరం పెళ్ళి చేసుకుందామా?" అనడిగేశాడు.

అది వింటూ "ఛీ. . ." అంటూ సిగ్గు పడిపోయి మొహాన్ని చేతులతో కప్పేసుకుంది. కాని మధుమూర్తి వదల్లేదు.

మరోసారి పెరట్లో జామిచెట్టు కింద ఉండగా మళ్ళీ అదే ప్రశ్న వేశాడు.

ఈసారి శ్యామల సిగ్గు పడలేదు కాని తల వంచుకుని ఉండిపోయింది. రెండు నిముషాల తర్వాత తలెత్తి—"పెళ్ళయితే శ్రావణ మంగళవారం

FREE !! **ముత్యాల సరాలు** ఉచితం !!!

# మూర్ఖులెవ్వరు?

"మూర్ఖులు చేయు అపరాధ పరిహారార్థం బలి వారిని అపహాస్యము చేయును. యథార్థవంతులు ఒకరి యందొకరు దయ చూపెదరు." అని బైబిలులో వ్రాయబడి యున్నది. పాపమును గూర్చి పరిహాసము చేయువారు మూర్ఖులట. మూర్ఖులకు పాపం ఒక పరిహాసం. దేవుడు పాపద్వేషి. పాపరహితుడైన దేవుని శిలువ మ్రాను కప్పగించింది పాపమే. మన వైద్యశాలలోని వ్యాధిగ్రస్తుల వ్యాధులకు మూల కారణం పాపమే. జీవితాంతం కారాగారశిక్ష కలుగ జేసేది పాపమే. ఇటువంటి పాపం గూర్చి పరిహాసంగా మాట్లాడేవారు మూర్ఖులు. పాపంచేసి తప్పించుకొని పోగలమనుకొనే వారు మూర్ఖులు. పాపం గూర్చిన హెచ్చరికలను లెక్క పెట్టని వారు మూర్ఖులు. దానిని గూర్చి పశ్చాత్తాప పడని వారు మూర్ఖులు.

మీ కిష్టమున్నా లేకున్నా, విత్తిన విషపు విత్తు ఫలితాన్ని అందుకునే రోజు ఒకటుంది. ఒకటికి పది వంతులు ఫలితం కోయక తప్పదు. మనము చేసిన పాపం ఏనాడో ఒకనాడు మనలను పట్టుకొన గలదనే సత్యం మూర్ఖులు గుర్తించ గలిగితే వారు చేస్తున్న పనుల గూర్చి వారు జాగ్రత్త వహించక మానరు. దినపత్రికలు ఒకసారి పరిశీలించండి. పాపము ఎంత విస్తృతముగా [illegible] అత్యాచారములను కలిగిస్తున్నదో బోధపడుతుంది. మానవులలో పాపభీతి నశించి పోతున్నప్పుడు వారు చేసే దుండగాలకు అంతముండదు. దుష్క్రియలకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగక పోవుట చూచి మనుష్యులు భయము విడిచి హృదయ పూర్వకముగా దుష్క్రియలు చేయుదురు. పాపం చేయుట వారికొక మహా పరిహాసం. క్షణికమైన ఆనందం కొసం మానవులెన్ని పాపక్రియలు జరిగించు చున్నారో!

చదువు, సంస్కారం ఉన్నంత మాత్రాన మానవుల పాశవిక ప్రవృత్తి తగ్గదు. మానవత వికసించదు. సహృదయత పెరగదు. మానవ హృదయం పరివర్తన చెందితేనే తప్ప మానవుని బాహ్య ప్రవృత్తి బాగుపడదు. అయితే ఈ హృదయ పరివర్తన ఎలా కలుగుతుంది? హృదయ పరివర్తన దేవుని శక్తి వలన కలగ వలసిందే కాని మానవ ప్రయత్నం వలనకాదు. దైవశక్తితో మార్పు చెందిన వాడు సహృదయతను సహజంగానే ప్రదర్శిస్తాడు. అది తనకు తాను తెచ్చి పెట్టుకున్న ప్రదర్శనం కాదు. దైవపుత్రునిగా దేవుని గుణములైన ప్రేమ, శాంతి, సంతోషం, సమాధానములను సహజంగా ప్రతిబింబిస్తాడు. మీరు హృదయ పరివర్తన పొందారా!

—చదలవాడ చంద్రమతీదేవి

ఉచితం !! ఉచితం !!!

దైవస్వరూపుడైన యేసుక్రీస్తు జీవిత చరిత్ర, ఆయన కమనీయ బోధలు తెలిపే 300 పేజీల అందమైన పుస్తకం ఉచితంగా పొంద దలచుకుంటే మీ చిరునామా ఈ రోజే తెల్పండి. పోస్టు ఖర్చులు మేమే భరించి మీకు ఉచితంగా పుస్తకం పంపుతాము.

ఇదీ అడ్రసు:
ఎస్. జాన్ డేవిడ్
A.M.G.
సుబాసు, నెం. 12
చిలకలూరిపేట
గుంటూరు జిల్లా ఆం. ప్ర.

Gospel Message Inserted by A.M.G.

పేరంటం చేసుకోవచ్చా? అనడిగింది మధుమూర్తిని. శ్యామలకు పేరంటం అంటే మహా పిచ్చి అని తెలుసు మధుమూర్తికి. ఏ సమయంలోనైనా మధుమూర్తితో ఆడుకోటానికి వచ్చేది కాని శ్రావణమాసంలో మంగళవారంనాడు మాత్రం అతనికి కనుచూపుమేరలో ఉండేది కాదు.

"ఏమిటి శ్యామలా. . .వెధవ పేరంటం. . . మానేద్దూ ఆడుకుందాం! అనేవాడు తనని ఒంటరి వాణ్ణి చేసేసి పేరంటం అంటూ పోబోయే శ్యామలతో విసుగ్గా. అది వింటూ శ్యామల కళ్ళు పెద్దవి చేసి చూస్తూ—"ఊహు పేరంటం మానటమే? నావల్ల కాదు బాబూ. . .చక్కగా పేరంటంలో పసుపు రాస్తారు. . .బొట్టు పెడ్తారు. . .గంధం పూస్తారు. . .భలే ఉంటుంది తెలుసా? నువ్వు మగాడివి కనుక నీకేం తెలీదు" అంటూ ఒక్క పరుగున పోయేది ఇంట్లోకి.

మధుమూర్తికి చాలా కోపం వచ్చేది.

కొన్ని గంటలు శ్యామలతో మాటలు మానేసేవాడు.

ఆ పైన మళ్ళీ మామూలే. . .

ఈ విషయం మనసులో మెదిలి వెంటనే—'ఓ మహా బాగా చేసుకోవచ్చు. . .బోల్డు మంది పేరంటాళ్ళని పిలుచుకోవచ్చు" అన్నాడు ఆశ పెడ్తూ.

శ్యామల కూడా ఆశగా కళ్ళు పెద్దవి చేసి చూస్తూ 'అయితే చేసుకుందాం!' అనేసింది.

అప్పటి ఆ దృశ్యం ఆలోచనా వాహినిలో కదిలే సరికి మధుమూర్తికి నవ్వొచ్చింది. కిటికీ దగ్గర్నుంచి కదిలి ఇవతలకు వచ్చి రూము మధ్యలో ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

పది సంవత్సరాలైపోయింది. . .ఈ పదేళ్ళలో ఎంత మారుంటుందో?? పరికిణీ, జాకెట్టు పోయి చీరలు కట్టుకునే మనిషయ్యుంటుంది. ఆ కళ్ళలో ఎంత అమాయకత్వం. ఆ అమాయకత్వం పోయి చిలిపి తనం కొత్తగా చేరి ఉంటాయా ఆ కళ్ళల్లో! జడకూడా బాగా బరువుగా అయ్యుంటుంది. . .జడ గంటలు పెట్టుకుంటుందో లేదో. . .

శ్యామల. . .ఎక్కడుంటుంది?. . .ఎలా ఉండి ఉంటుంది?. . .ఆమె తనని ఇంకా జ్ఞాపకం ఉంచుకుని ఉంటుందా?. . .

ఊహు. . .ఊహు. .మర్చి పోదు. . .ఎలా మర్చిపోతుంది?. . .అంతగా ఆడిపాడిన శ్యామల. . అంతగా కలిసి మెలిసి తిరిగిన శ్యామల తన జ్ఞాపకాల నుంచి అంత తేలిగ్గా చెరిపేసుకుంటుందా?

ఆ రోజు. . .ఆ దురదృష్టపు రోజు. . .చ. .చ తనదెంత దుర్భాగ్యం ఆఖరిసారి కూడా శ్యామల్ని చూడలేకపోయాడు.

మధుమూర్తి చూపులు ఎక్కడో నిలిచాయి. అతని మనో దర్పణం మీద ఆలోచనలు గతంలోని దృశ్యాల్ని ప్రతిబింబింపజేస్తున్నాయి.

రాజమండ్రి నుంచి బాబాయి వచ్చాడా రోజు. . . బాబాయికి పిల్లలు లేకపోవటం వలన తనంటే అంతులేని మమకారం. రెండు రోజులు కాకినాడలో ఉన్నాక పిన్ని చూడాలంటోందంటూ రాజమండ్రి రమ్మన్నాడు.

తనకి రైలు వరదా. . .పాడు వరదా. . .ఆ వరదాయే తనకెంత క్షోభ తెచ్చిపెట్టింది. . రాజమండ్రి దాకా అనగానే పరేసంటూ బాబయి కూడా బయలుదేరిపోయాడు. వెళ్తూ వెళుతూ శ్యామలతో కూడా చెప్పి వెళ్ళలేదు.

రెండురోజులు రాజమండ్రిలో ఉండే సరికి ఇంక తోచలేదు. శ్యామల మీద ధ్యాసతో కాకినాడ మీదకు దృష్టి మళ్ళీ పోయింది. . . .నసేమిరా ఇంక ఒక్కక్షణం కూడా ఉండనంటూపట్టుబట్టాడు. చేసేది లేక బాబాయి తీసుకు వచ్చి కాకినాడలో విడిచి వెళ్ళిపోయాడు.

ఇంటికి వచ్చిన ఆ తరవాత క్షణం కాలు నిలవలేదు. వాళ్ళింటి వాటా వైపు పరుగుతీశాడు.

"శ్యామలా!" అంటూ పెరుగెట్టుకెళ్ళిన మధుమూర్తి వీధి గుమ్మానికి పెద్ద తాళం కప్ప వేసుండటం చూసి విస్తుపోయాడు. అలా కొన్ని క్షణాలు నిలబడి పోయి . . . ఎక్కడకెళ్ళింది శ్యామల? . . వూరికి వెళ్ళిందా? అనుకుంటూ వెనక్కి తిరిగి పరుగున తనింట్లోకి వచ్చేశాడు.

వంటింట్లోకి వెళ్ళి గుమ్మంలో నుంచి పచ్చేసుకుంటున్న తల్లితో—

"అమ్మా ...శ్యామలా వాళ్ళు ఎక్కడికివెళ్ళారు?" అన్నాడు.

తల్లి చెప్పిన సమాధానం మధుమూర్తిని అయోమయంలో ముంచేసింది. అదేమిటో అప్పట్లో అతనికి సరిగ్గా అర్థంకాలేదు. ఏమైనా అతనికి చివరకు తెలిసింది శ్యామలా వాళ్ళ నాన్నగారికి వ్యాపారంలో నష్టం వచ్చిందనీ . . .అందుకే ఎక్కడికో వెళ్ళి పోయారనీ . . . .మరిరారనీ . . . మధుమూర్తికి చాలా రోజులు పిచ్చెత్తినట్లు అయిపోయింది. ఎప్పుడూ మనసు కమ్మినట్లుండే వాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుండి పోయేవాడు.

"ఏమిటి మధుబాబూ . . . ఏమిటలా ఉంటున్నావు?" తల్లి మధుమూర్తి తల నిమురుతూ జాలిగా అడిగేది. ఆవిడకు తెల్సు కొడుకు శ్యామల లేకపోవటం వలన చిక్కిపోయాడని. మెల్లగా అతని దృష్టి ఆఅమ్మాయి మీది నుంచితప్పించాలని ప్రయత్నించేది. అది సాధ్యం కాలేదు.

ఏళ్ళు గడిచి స్కూలు వదిలి కాలేజికి వచ్చి . . ఆపైన ఉద్యోగంలో ప్రవేశించినా మధుమూర్తి శ్యామల తాలూకు స్మృతులకు దూరం కాలేకపోయాడు.

శ్యామలే అతని జీవితంగా . . .శ్యామలే ప్రాణంగా అయిపోయింది అతనికి.

శ్యామల పట్ల తనికి చెరగని ఈ ప్రేమేమిటి? . ఎందుకిలా అంత పిచ్చిగా ఆమె గురించే పరితపిస్తున్నాడు? . . . తనలాగే శ్యామల కూడా తన గురించి ఆలోచిస్తుంటుందా? . . .అవునూ అనుకోటానికి ఆధారం లేదు . . . కాదు అనుకోటానికి మనస్కరించలేదు.

లేదు . . . లేదు . . .శ్యామల తనని మర్చిపోదు . . . మర్చిపోయుండదు. తనలాగే ఆమె కూడా తన కోసం ఆలోచిస్తూ ఉండి ఉంటుంది. బాధపడుతూ ఉంటుంది . . . . బెంగపడుతూ ఉంటుంది . . . .తను శ్యామల కోసం— శ్యామల తన కోసం . . . ఒకళ్ల కోసం ఒకళ్ళు పుట్టి

> **నీడ**
>
> తాటిచెట్టు నీడనీ
> ఉన్నవాడి ధర్మాన్నీ
> నమ్మడం భ్రమే!
>
> -ఎల్లోరా

నప్పుడూ . . .ఒకరికొకరం అయినప్పుడు . . . . ఎలా విస్మరిస్తుంది? ఈ వియోగం తాత్కాలికమే . . అంతేనా? నిజంగానే అంతేనా? . . . .

అయితే ఎన్నాళ్ళీ అన్వేషణ? . . . . ఎన్నాళ్ళీ తపన? . . . . ఇంకా . . . ఇంకా ఎప్పటి వరకూ ఈ నిరీక్షణ?

ఎక్కడికి వెళ్ళినా ఏ చోటున పదిమంది ఆడపిల్లలు కనపడినా కళ్ళు శ్యామలనే వెదుకుతాయి. వాళ్ళలో . ఇన్ని సంవత్సరాల్లో వెళ్ళిన ప్రతీవూళ్ళోనూ శ్యామల కోసం చూస్తూనే ఉన్నాడు. గాలిస్తూనే ఉన్నాడు. కాని ఏదీ . . .ఎక్కడ . . . ఎప్పుడూ . . .

మధుమూర్తి ఉలిక్కిపడి చూశాడు. చీకటి పడిపోయింది. రూమంతా గాఢాంధకారం అలముకుని ఉంది. కుర్చీలోంచిలేచివెళ్ళి లైటు వేశాడు. రెప్పపాటు కాలంలో గదంతా పాలవెలుగు పరచుకుంది.

ఈ వెలుగులాగే రావాలి శ్యామల కూడా.ఈ వెలుగులాగే నిండాలి తన జీవితంలో.

మధుమూర్తి కిటికీ దగ్గరకు నడిచాడు . . . అవతల కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది. క్షణంసేపు అలా నిలబడి ఇవతలకు కదలి వచ్చాడు రాక్ దగ్గరకు వెళ్ళి డైరీ తీశాడు.

మళ్ళీ వచ్చి కుర్చీలోకూర్చుని డైరీ తెరిచాడు అందులో ఒక పేజీలో.

విశాఖలో వెతికాను శ్యామల కనబడ లేదు...విజయవాడలో చూశాను . . . ఏలూరు, గుంటూరుల్లో కూడా ఆమెని కనుక్కునే అదృష్టం లేకపోయింది. ఇప్పుడు . . . ఇప్పుడు అమలాపురం . . . ఇక్కడైనా కనిపిస్తుందా . . . తన తపస్సు ఫలిస్తుందా? . . . .

అందులో తను రాసుకున్నది చదువుకున్నాడు మధుమూర్తి. అతనికి ఒకటే నమ్మకం...శ్యామల కనబడుతుంది.. శ్రావణ మాసపు పేరంటాలలో ఎప్పుడో అప్పుడు కనపడుతుంది. . . శ్యామలకు పేరంటం అంటే తగని ఇష్టం. . .ఆ ఇష్టమే తనకి ఆమెని దొరికేలా చేస్తుంది. అందుకే శ్రావణ మాసం వస్తోందీ అంటే మధుమూర్తి మనసులో ఒక ఆశా కిరణం తొంగి చూస్తుంది. అది శ్యామల అన్వేషణ కోసం తహతహలాడుతుంది.

శ్యామల తనకి తారసపడుతుంది. . . తనకి దర్శనమిస్తుంది. . . శ్రావణమాసపు పేరంటాలుగా హటాత్తుగా ఎదురు పడుతుంది. . . ఎదురు పడి...

మధుమూర్తి మనసు ఉక్కిరి బిక్కిరి అయిపోయింది.

ప్రేమ ఎంత విచిత్రమైందీ. . . ఎంత బలమైందీ. . . లోకంలో ఎన్ని ప్రేమ కథలున్నా తనది. మరీ విచిత్రమైన కథ. . . ఈ వియోగం మరీ వింతైనది. అంతస్థులు అడ్డు లేదు. . . అయిన వాళ్ళ అభ్యంతరాలు లేవు అయినా తన ప్రేమ ఫలించటం లేదు.

అసలు ఫలిస్తుందా. . . తనకి శ్యామల్ని ప్రసాదిస్తుందా?

శ్యామలా. . . శ్యామలా. . . శ్యామలా. . . ఒక మాటు కనిపించవ్?

మధుమూర్తి మనసు ఆక్రోశించింది.

తల్లి అస్తమానూ పెళ్ళి పెళ్ళి అంటూ పేరి సంబంధం చూద్దాం, చూద్దాం అంటూ దాటేస్తూ వచ్చాడు.

మొన్న ఆ మధ్య మరీ పట్టు బట్టింది మళ్ళీ పుష్కరాలు వచ్చేస్తున్నాయి. . . ఏడాది వరకూ మళ్ళీ కుదురవుట అంటూ—

హమ్మయ్య . . . అనుకునాడు ఆ మాట వింటూ. పుష్కరాల పేరున మరో సంవత్సరం శ్యామల కోసం తన అన్వేషణ సాగించవచ్చు.

శ్యామల్ని కూడా వాళ్ళ వాళ్ళు తొందర పెడుతున్నారేమో. . . శ్యామల కూడా తనలాగే వాయిదాలు వేస్తూ గడుపుకొస్తుందేమో. . . శ్యామలకి కూడా ఈ పుష్కరాలు అడ్డు వస్తాయి. అవును... విధి తమ ఇద్దరికీ ఒకరి నొకరు వెదుక్కోటానికి మరో సంవత్సరం గడువిచ్చింది.

మధుమూర్తి లేచి కిటికీ దగ్గరకు వెళ్ళాడు వర్షం వెలిసింది. స్కైను చూసుకున్నాడు. ఏనిమిదయింది.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది మధుమూర్తికి తను హోటల్‌కి వెళ్ళి భోజనం చేయాలని. తొందర తొందరగా బట్టలు వేసుకుని రూముకి తాళం వేసి హోటల్‌కి బయలు దేరాడు.

వాననీరు రోడ్డు పక్క సైడు కాల్వల్లో సుడులు తిరుగుతూ పారుతోంది. చల్లటిగాలి వంటిని వొరుసుకు పోతూంది. మధుమూర్తి ఆకాశంలోకి చూశాడు. మేఘాలు కరగిపోయాయి. . . చుక్కలు మెరుస్తున్నాయి.

తనలోని ఆశల్లాగే! మధుమూర్తి అనుకున్నాడు. ఎన్ని రకాల ఆశలూ— ఎన్ని రకాల భ్రమలూ. . . .

శ్యామల అన్వేషణ పిచ్చి కొన్నిసార్లు తారస్థాయికి చేరుకునేది ఒక్కొక్క సారి. . .

ఏలూరులో వన్నెసేటప్పుడు అతని సీటు ప్రక్కన ప్రకాశం అనే అతను ఉండేవాడు. మధుమూర్తికి అతనికీ సన్నిహితత్వం ఎక్కువగా ఉండేది.

ఒకరోజు మధుమూర్తి — "ప్రకాశం! . . . మీ ఇంటి దగ్గర ఎక్కడైనా శ్యామల అనే పేరుగల అమ్మాయి ఎవరైనా ఉందా?" అనడిగాడు ప్రకాశం.

ప్రకాశం అది వింటూ ఆశ్చర్యంగా మొహం పెట్టి ఉంది—ఏం అనడిగాడు. మధుమూర్తి గుండెలు క్షణంసేపు కొట్టు కోవటం మానేశాయి. అయితే శ్యామలే. . . తన శ్యామలే . . . మనసులో

తాజా వార్తలకు
ఆంధ్ర ప్రభ - దిన పత్రిక
చదవండి

మీరు ఒకసారి "ట్యాంగో" వాడయుంటే
మరి దానినుంచి మారటం కష్టమౌతుంది
ట్యాంగో ®
అండర్‌వేర్లు - బనియన్లు



జిందాబామ్ సురక్షితమైన, నమ్మకమైన బాధానివారిణి

అనుకున్నాడు.

మధుమూర్తి మాట్లాడక పోవటంతో ప్రకాశం మళ్ళీ ఎందుకలా అడిగావ్ మధుమూర్తీ?... ఆ అమ్మాయి నీకు తెలుసా అన్నాడు.

మధుమూర్తి గొంతు పెగుల్చుకొని "ఆ అమ్మాయి ఎలా ఉంటుంది?" అనడిగాడు అడిగేసి ఆతృతగా ప్రకాశం మొహంలోకి చూడ సాగాడు.

ప్రకాశం విచిత్రంగా చూశాడు మధుమూర్తి మొహంలోకి. అలా చూస్తూ "ఏం అన్నాడు.

మధుమూర్తి కంఠం అదోలా పలికింది—" "కావాలి. . . . కావాలి. . . చెప్పు.. ఎలా ఉంటుంది?

"పొట్టిగా . . .నల్లగా ఉంటుంది" అన్నాడు ప్రకాశం.

"ఛ .. .ఛ.. ఆ శ్యామలకాదు . . . ఆ శ్యామల కాదు . . . ." మధుమూర్తి గొణుక్కుంటున్నట్టు అన్నాడు.

ప్రకాశం తెల్లబోయాడు. అతనికి అదేమిటో తెలుసుకోవాలనిపించింది. తరచి తరచి అడిగాడు. చివరకు మధుమూర్తి చెప్పాడు. వింటూ పెద్దగా నవ్వాడు ప్రకాశం, "భలే ఘాటు ప్రేమోయ్ నీది...." అంటూ.

మధుమూర్తి ఆ వేళాకోళాన్ని భరించలేక పోయాడు. అలా అని ప్రకాశాన్ని ఏం అనలేక పోయాడు. ఆపైన ఎవరి దగ్గరా శ్యామల ప్రస్తావన తీసుకురాకూడదని మాత్రం గట్టిగా నిర్ణయించు కున్నాడు.

మధుమూర్తి ఏదో జ్ఞాపకం వచ్చినట్టు చటుక్కున ఆగిపోయాడు. చుట్టూ చూశాడు . . . అప్పటికే తను వెళ్ళవల్సిన హొటల్‌ని చాలాదూరం దాటి వచ్చేశాడు.

మధుమూర్తి వెనక్కి నడిచి హోటల్‌కి వెళ్ళాడు. భోజనం పట్ల ఆసక్తి కనబరచలేకపోయాడు. ఏదో నాలుగు మెతుకులు నోట్లో పెట్టుకుని లేచిపోయాడు. అతన్ని పూర్తి శ్యామల ఆలోచనలు వశపర్చుకున్నాయి.

రూముకి వచ్చి ఏదైనా చదువుదామని పుస్తకం తెరచాడు. ఒక్క అక్షరం కూడా బుర్రకెక్కలేదు. పుస్తకం మూసి పక్కనపడ వేశాడు. చాలా రాత్రి వరకూ నిద్రలేమితో గడిపాక తెల తెలవారుతుంటే మధుమూర్తికి నిద్రపట్టేసింది.

• • •

ప్రక్కవారం మంగళవారం ఆఫ్ డే పర్మిషన్ తీసుకుని వచ్చేస్తూంటే కొలీగ్స్ జోక్ చేశారు—"ఏమిటీ మధుమూర్తీ . . . .పేరంటం ఏమైనా ఉందా?" అంటూ

మధుమూర్తి నవ్వేసి వచ్చేశాడు.

రూమ్‌కి వచ్చి రిఫ్రెష్ అయి వీథిలోకి బయలు దేరాడు. రంగు రంగు చీరలతో పూలవాన కురిసినట్టు రోడ్లన్నీ అందంగా కనిపిస్తున్నాయి.

మధుమూర్తి కళ్ళు శ్యామల పోలికలున్న అమ్మాయిల్ని తరచి తరచి పరిశీలిస్తున్నాయి. వాళ్ళలో ఎవరూ కూడా శ్యామల అనిపించలేదు.

ఎప్పుడో చిన్నప్పుడు చూసినా శ్యామల్ని తను పోల్చుకోగలడు. ఆ నమ్మకం ఉంది. ఆమె పూల రథంలా ఉన్నా . . . మెరుపు తీగలా ఉన్నా . . . తను కనిపెట్టగలడు. శ్యామల చెరువుల్లాంటి కళ్ళు చూస్తే చాలు ఆమెని గుర్తుపట్టెయ్యగలడు.

పొద్దువాలిపోయింది. . . .పేరంటాలు వెళ్ళబడి పోయారు. మధుమూర్తికి శ్యామల కనపడలేదు . . . ఒక వారం అయిపోయింది.

మధుమూర్తి నీరసంగా రూముకి నడిచాడు. ఆ రాత్రి ఇంటివాళ్ళమ్మాయి జానకి సెనగలు కారంలో వేయించి తీసుకొచ్చింది.

ఆమెకి శ్యామల తెలుసునేమో! . . . మధుమూర్తి అడుగుదామనుకొని నోటి వరకూ వచ్చి ఆగి పోయాడు. అతనికి ప్రకాశంతో అనుభవం జ్ఞాపకం వచ్చింది.

"ఏమిటలా ఉన్నావ్ అన్నయ్యా?" జానకి అడిగింది మధుమూర్తిని ఆదోలా ఉండటం చూసి.

మధుమూర్తి మామూలుగా అయిపోతూ— "ఊహు . . . .ఏం లేదమ్మా . . .ఏం లేదు" అన్నాడు.

జానకి ఒకసారి అతని ముఖంలోకి చూసి వెళ్ళిపోయింది.

మధుమూర్తికి దేవుడు మీద విపరీతమైన కోపం వచ్చింది. లేకపోతే ఈ ప్రేమలేమిటి . . .ఈ మోహాలేమిటి? అందుకోసం ఈ దాగుడు మూతలేమిటి?

కనిపిస్తే నిలదీసి అడిగేయాలనిపించింది.

మధుమూర్తికి అశాంతిగానూ—అసహనంగానూ ఉంది. రాత్రంతా ప్రక్కమీదఅటూఇటూ దొర్లుతూ ఉండిపోయాడు. రాత్రెలాగో గడిపేశాడు. మళ్ళీ తెల్లవారటం. . . మరో వారం కోసం ఎదురుచూడటం.

మధుమూర్తికి పిచ్చెక్కిపోతూందేమోననిపించింది


ఇది ఆఖరి వారం . . . మధుమూర్తి నిద్ర లేస్తూ అనుకున్నాడారోజు. అంతకు ముందు మూడు వారాలు శ్యామల కోసం కళ్ళలో వత్తులు వేసుకుని చూశాడు వూరంతా. ఎన్నో వందల మందిని చూసినా అతనికి ఎక్కడా శ్యామల కనపడలేదు.

తనకిక నిరాశతప్పదు. ఇంక తను జన్మలో శ్యామల్ని కనుక్కోలేడు. తన ప్రేమలో ఏదో లోపం ఉంది. అందుకే భగవంతుడు ఆమెతో తన కథ అర్థాంతరంగా ఆపేసి విడదీశాడు.

మధుమూర్తికి మనసులో దిగులు గూడుకట్టుకుంది. సాయంకాలం అనాసక్తిగానే తయారయి వూళ్ళోకి బయలుదేరాడు. అతని కళ్ళు అలా పరిశీలనగా చూస్తూనే ఉన్నాయి. మనసు మరేదో ఆలోచిస్తూంది.

సంధ్యవాలుతోంది. మధుమూర్తికి ఇంక తిరగాలని పించలేదు. రూముకి వెళ్ళిపోదామనిపించింది. మెల్లగా నడుస్తున్నాడు. ఏ ఆడపిల్ల కంఠం వినపడినా ఉలికిపాటుతో చూస్తున్నాడు. నిరాశగా నిట్టూర్చి మళ్ళీ నడక సాగిస్తున్నాడు.

మధుమూర్తి ఇంటి దగ్గరకొచ్చి గేట్లోకి వెళ్ళబోతూంటే ఇంటి వారమ్మాయి జానకి ఎవర్నో సాగనంపుతూ ఎదురొచ్చింది. వాళ్ళని తప్పించుకుని ప్రక్కనుంచి లోపలికి వెళ్ళబోతుంటే—



కన్ను - కాళ్ళు
— చిత్రం సి .కృష్ణానంద కుమార్

"మరి ఉంటాను శ్యామలా. . . అప్పుడప్పుడొస్తూండు" అంటూ జానకి అనటం వినిపించింది.

మధుమూర్తి చటుక్కున వెనక్కి తిరిగాడు.

అప్పటికే ఆ అమ్మాయి రోడ్డు మీదకు వెళ్ళిపోయింది. జానకి ఇంట్లోకి వచ్చేస్తూంది. మధుమూర్తి చకచకా జానకిని సమీపించి— "జానకీ. . .ఎవ రా అమ్మాయి?" అనడిగాడు.

జానకి వింతగా చూసింది .అత నలా ఎందు కడిగాడో అర్థం కాలేదు.

మెల్లగా తేరుకుంటూ—"శ్యామల అని నా ఫ్రెండన్నయ్యా" అంది.

"వాళ్ళ నాన్నగారి పేరు?" మధుమూర్తి ఆతృతగా అడిగాడు.

జానకి చెప్పింది.

మధుమూర్తికి ఆనందం కట్టలు తెంచుకుంది. 'తన శ్యామలే. . .తన శ్యామలే. . . గుడ్ గాడ్. తన అన్వేషణ ఇన్నాళ్ళకి ఫలించింది. . . తన నిరీక్షణ ఎంతకాలానికి నెరవేరింది?. .

మధుమూర్తి వేగంగా గేటువైపు నడుస్తూ 'ఒక్క నిముషం జానకీ—" అంటూ ముందుకు వెళ్ళిపోయాడు.

జానక్కి మరింత అయోమయం అనిపించింది.

మధుమూర్తి ఎందుకలా శ్యామల వెనక వెళ్ళాడో అర్థం కాలే దామెకు.

మధుమూర్తి పరుగులాంటి నడకతో శ్యామల్ని చేరుకున్నాడు.

ఆమె దగ్గరకు చేరుతూనే "శ్యామలా!" అని పిలిచాడామెని.

శ్యామల చటుక్కున వెనక్కి తిరిగింది. తన వెనుకే నిలబడిన మధుమూర్తిని చూసి ఎవరో అన్నట్లు చూడసాగింది. ఆమె జ్ఞాపకాలలో బహు దూరంగా ఉన్నాడతను.

"నేనూ. . . మధుమూర్తిని. . . కాకినాడలో చిన్నప్పుడు రామారావు పేట్లో. . ." తనని తను గుర్తుకు చేస్తూ తెగిపోతున్న మాటలతో అంటున్నాడు.

శ్యామల కనుబొమలు ముడిచి చూసింది.

ఆమె ఏదో జ్ఞాపకం చేసుకోటానికి ప్రయత్నిస్తూంది.

చివరకు ఆమె కళ్ళు మెరిశాయి. పెదాలు విప్పగా నవ్వాయి. ఆమె కంఠం వణుకుతుంటే— "నువ్వా మధూ. . . ఎన్నాళ్ళకీ. . . ఎక్కడున్నావ్. ఏం చేస్తున్నావ్?" ప్రశ్నల వర్షం కురిపించింది.

ఆమె తనని గుర్తుపట్టినందుకు పొంగిపోయాడు మధుమూర్తి.

"ఇక్కడే. . .జానకి వాళ్ళింట్లో. . .అదే నీ స్నేహితురాలు. . .వాళ్ళింట్లో ఉంటున్నాను. ఉద్యోగం చేస్తున్నాను. . . ఎన్నాళ్ళుగా వెదుకుతున్నాను. . .ఇన్నాళ్ళకి కనిపించావా?" మధుమూర్తి అన్నాడు.

నిజమా అన్నట్లు చూసింది శ్యామల.

"నువ్వెక్కడ ఉండేది?" అడిగాడు.

శ్యామల సిగ్గు పడింది. వీధి దీపాల కాంతిలో స్పష్టంగా మధుమూర్తికి అది కనబడింది. ఆ సిగ్గుకి అతను వేరే అర్థం తీసుకునే లోపుగా—

"ఇక్కడే మధూ. . . శంకరమఠం దగ్గర. మావారు బాంక్ మేనేజర్. . .ఒకసారి రాకూడదు!" అంది శ్యామల.

అంతవరకూ మధుమూర్తి తీగెలా అందంగా సాగిన ఆమెని, ఆమె చెరువుల్లాంటి కళ్ళనీ. . చక్కటి ముక్కునీ. . .చిక్కగా పొడుగ్గా ఎదిగిన జడనీ వాటినే గమనించాడు. అతనికి ఆమె మెడ వైపు చూడాలనే ధ్యాస లేకపోయింది. ఆ ఆలోచనే రాలేదు. అప్పుడు ఆమె మాట అన్నాక చూశాడు మధుమూర్తి.

శంఖంలాంటి మెడని కౌగిలించుకుని నల్లపూసల తాడూ—పల్చటి నానుతాడూ వెక్కిరింపుగా కనిపించాయి అతనికి.

అతని దృష్టి ఆమె పాదాల వైపు నిలిచింది. కాలి వేళ్ళకు వెండిమట్టెలు మెరుస్తున్నాయి.

"వస్తాను మధూ. . .చీకటి పడుతోంది. రేపు తప్పకుండా రా. . .మావారి పేరు. . ." శ్యామల చెప్తూంది. మధుమూర్తి హృదయం భారీ అయిపోయినట్లు అయిపోయింది.

అయినా మనస్సిమిత పరచుకుంటూ— "వస్తాను. .వస్తాను. ." అన్నాడు. ఆ మాటలు అతనికే వినిపించనంత మెల్లగా వచ్చాయి.

శ్యామల మరోసారి చెప్పి వెళ్ళిపోయింది. మధుమూర్తి అలా రెండు నిముషాలు నిలబడి పోయాడు. మేఘాలు ఎప్పుడు ముసురుకున్నాయో ఆకాశం వర్షించసాగింది. మధుమూర్తి కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతూంటే వేదాంతిలా నవ్వుకుంటూ మెల్లగా రూమువైపు నడవసాగాడు. *